

సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,29 అక్టోబర్ 2025

8 పేజీలు





# తీరాన్ని తాకిన మొంథా

# కోనసీమలో రెడ్ అలర్ట్

- అంతర్వేది రాజోలు మధ్య తుపాన్
- అంతర్వేదిలో విపరీతంగా ఈదురుగారులు
- ఈదురుగాలులుతో దంచికొడుతున్న వర్షాలు
- మంగళవారం అర్ధరాత్రి తీరం దాటే ఛాన్స్
- కాకినాడ, కోనసీమ, విశాఖ, కృష్ణా జిల్లాల్లో తీవ్ర ప్రతాపం
- తీరంలో ఎగసి ఎగసి పడుతున్న సముద్రపు అలలు
- రాత్రి 7 తర్వాత రాకపోకలు బంద్
- కాకినాడ జిజిహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు-తుఫాన్
- హెచ్చరికలలో వణకుతున్న జిల్లాల ప్రజలు

బంగాళాఖాతంలో మెంథా తుఫాను గడిచిన రెండు రోజులుగా అల్లకల్లోలం సృష్టిస్తోంది. మూడో రోజు ఉగ్రరూపం దాల్చి తీరప్రాంతాల్లో తీవ్ర అలజడి రేపుతోంది. బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు భయపెడుతున్నాయి. ముంచుకొస్తున్న ముప్పుపై జిల్లా యంత్రాంగం రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ సమయంలో కూటమి ప్రభుత్వం చాలా గొప్పగా అప్రమత్తమమైంది.ముప్పు ఎదుర్కొవడానికి అన్ని రకాలుగా సిద్ధమైంది. ప్రాణ, ఆస్థి నష్టాన్ని నివారించడానికి ముందస్తుగా జాగ్రత్త చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్లు షాన్మోహన్, కుమార్, కీర్తిలు అన్ని శాఖల అంతర్గత సమీక్షలతో సన్నాహచర్యలను సమీక్షిస్తున్నారు. సీఎం నుంచి మంత్రుల వరకు, సీఎస్ నుంచి జిల్లా కలెక్టర్లు వరకు ప్రతీ ఒక్కరు అలర్ట్ అయ్యారు.ప్రతీక్షణం పరిస్థితని సమీక్షిస్తున్నారు.తీరం వెంబడి, ప్రమాదకరప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిని,లోతట్టు ప్రాంతాల వారిని పునరావాసాలకు తరలించారు. పునరావాసాల్లో సహాయశిబిరాలు నిర్వహించారు. ఆహారం, త్రాగునీరు, వైద్యం తదిరల ఏర్పాట్లు చేశారు. ఎస్ఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎస్ బలగాలు ప్రభావిత ప్రాంతాల్లో మోహరించాయి... మంత్రి వాసంశెట్టి సుభాస్ కోనసీమ జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. కలెక్టర్‌తో చర్చించి అప్రమత్తంగా వ్యవహరించారు. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ పునరావాస స్థావరాలను పరిశీలించి అన్ని ఏర్పాట్లు సమీక్షించి దగ్గరుండి రుచి చూసి మరీ పునరావాస కుటుంబాల వారికి ఆహారం, అన్ని వసతులు అందించారు.

- మిగతా 2 లో..

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో





## సమన్వయంతో తుఫాన్‌ను
# సమర్ధంగా ఎదుర్కొందాం

- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి వాసంశెట్టి సుభాష్
- అండగా ఉండి ఆదుకుంటామని ప్రజలకు భరోసా



**కె.గంగవరం,మేజర్‌న్యూస్ :** ప్రకృతి విపత్తు సమయాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ కోనసీమజిల్లా రామచంద్ర పురం నియోజవర్గం కెగంగవరం మండలంలోని పామర్రు, కూళ్ల, సుందరపల్లి, మసకపల్లి, పేకేరు తదితర గ్రామాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాలు, పునరావాస శిబిరాలను మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం పరిశీలించారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, స్వచ్ఛ భారత్ డైరెక్టర్ సలాది రమేష్, గంగవరం మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్,రామచంద్రపురం పట్టణ అధ్యక్షులు ఉండవెల్లిశివ,మరివాడ సూరిబాబు తదితరులు ఉన్నారు.ఈసందర్భంగా మంత్రిసుభాష్ పురావాస శిబిరంలో ఉన్న బాధితులతో మాట్లాడి అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తుఫాన్ సహాయక చర్యలను స్వయంగా పరిశీలించారు.ఈరాత్రికి వాయుగుండం

- తరువాయి 2లో..

## ప్రకృతి వైపరీత్యాలు వల్ల ప్రాణ ఆస్తి నష్టాలకు
# తావు లేకుండా పనిచెయ్యాలి

### జిల్లా ఇన్చార్జ్ మంత్రి అచ్చెన్న నాయుడు



**అమలాపురం, మేజర్‌న్యూస్ :** తుఫాన్లు వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలుసహజసిద్ధంగా సంభవిస్తా యని వాటి వల్ల ప్రాణ ఆస్తి నష్టాలకు తావు లేకుండా ప్రజాప్రతినిధులు ప్రభుత్వయంత్రాంగం సమన్వయం తో వ్యవహరించాలని జిల్లా ఇన్చార్జ్ మరియు వ్యవసాయ సహకారం మార్కెటింగ్‌శాఖడైరీ డెవలప్మెంట్ మత్స్యశాఖ మంత్రి కెఅచ్చెన్న నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఆయన వివిధ శాఖల అధికారులతో మొంథా తుఫాన్ తీవ్రత,సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల నిర్వహణ రోడ్లు రాక పోకలు విద్యుత్ సరఫరా అంశాలపై ప్రత్యేక అధికారి విజయరామరాజు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన సమీక్షించారు.చాలామంది ఇల్లు విడిచి బయటకు రావడానికి ఇష్టపడరని అయి నప్పటికీ వారి యోగక్షేమాలను కోరుతూ బలవంతంగా నైనా తరలించాలన్నారు మొంథా తుఫాను నేటి (మంగళవారం) సాయంత్రం 5 గంటలు రాత్రి 10గంటల మధ్య రాజోలు సమీప ప్రాంతంలో తీరని దాటే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ వెల్లడించినట్లు మంత్రివర్యులు తెలిపారు. జిల్లా ప్రజానీకానికి టైం టు టైం వరద హెచ్చరికల సమాచారాన్ని అందిస్తూ అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఈదురుగాలుల తీవ్రత క్రమంగా పెరుగు తోందని ప్రజలు అప్రమత్తం కావాలన్నారు. అందరినీ పునావాస్ కేంద్రాలకు తీసు కువచ్చి రేపు సాయంత్రం వరకు పునరావస కేంద్రాలలో ఆశ్రయం కల్పించి రాత్రి భోజనం అనంతరం తిరిగి ప్రభుత్వం ప్రకటించిన రూ 3వేల ఆర్థిక

- తరువాయి 2లో..

# మొంథా తుఫాన్‌కు ధీటుగా ప్రజలకు బాసటగా నిలుస్తాం

**– మంత్రి కందుల దుర్గేష్**

**– ప్రజలకు అండగా నిలబడేందుకు ముంబయి పర్యాటక పర్యటన రద్దు.**

**పెరవలి, మేజర్ న్యూస్ :** రాత్రి 10 గంటలకు పెరవలి మండల తాసిల్దార్ కార్యాలయంలో అధికారులు తుఫాను సహాయక చర్యలపై చర్చిస్తుండగా మంత్రి దుర్గేష్ ఆకస్మికంగా పెరవలి మండల తాసిల్దార్ కార్యాలయానికి రావడంతో అధికారులు స్థానిక నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొంథా తుఫాన్ కు సంబంధించిన అన్ని జాగ్రత్తలను తీసుకుందని తెలియజేశారు. ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం సోమవారం ముంబయి పర్యాటక పర్యటనకు బయలుదేరి వెళ్లిన మంత్రి కందుల దుర్గేష్ హైదరాబాద్ చేరుకోగానే మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో తన పర్యటనను రద్దు చేసుకొని తిరిగి రాజమహేంద్రవరం చేరుకున్నారు. ఎయిర్ పోర్ట్ నుండి నేరుగా ఇంటికి వెళ్లకుండా నిడదవోలు తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ స్థానికంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా మొంథా తుఫాన్ తాజా పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం, పెరవలి తాసిల్దార్ కార్యాలయం, ఉండ్రాజవరం మండలాల తహసిల్దార్ కార్యాలయాల్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ల ద్వారా సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏ చిన్న సమస్య కూడా తలెత్తకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రకృతి విపత్తులు, వరదలు తలెత్తిన సమయంలో ఏ రకంగా స్పందించాలనే అంశంపై అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో తూర్పుగోదావరి జిల్లాలోని ప్రతి గ్రామంలో ఏ తరహా చర్యలు చేపట్టాలన్న అంశంపై జిల్లా అధికార యంత్రాంగానికి ప్రత్యేక ప్రణాళికను నిర్దేశించామన్నారు. ప్రజలకు ఏ చిన్న సమస్య కూడా తలెత్తకుండా అధికారులు, నాయకులు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యలను పర్యవేక్షించాలని, ప్రజలకు బాసటగా నిలవాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ క్రమంలో ముందస్తు చర్యలపై అధికార యంత్రాంగానికి మంత్రి కందుల దుర్గేష్ దిశా నిర్దేశం చేశారు.ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తుఫాను వల్ల ఎలాంటి సమస్య లేదని, అధికారులు పూర్తిస్థాయి జాగ్రత్తలు చేపట్టారని వెల్లడించారు. ఈ సందర్భంగా రాబోయే రెండు మూడు రోజుల్లో తుఫాన్ పరిస్థితి అంచనా వేసుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశానని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.తుఫాన్ ధాటికి ఎక్కడైనా చెట్లు పడిపోవడం, స్తంభాలు విరిగి పడటం వంటి ఘటనలు కనిపిస్తే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా మార్గం సుగమం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో 16 జెసిబిలు, 10 జనరేటర్లు, 17 ట్రాక్టర్లు, 14 వాటర్ ట్యాంకర్లు(రూరల్ లో పది, అర్బన్‌లో నాలుగు), 5 ఈ వాటర్ ఎక్విప్మెంట్స్ , 22 సెల్ ఫోన్ టవర్స్ ను ప్రభావిత ప్రాంతాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం కంట్రోల్ రూమ్‌గా వ్యవహరిస్తుందన్నారు. 24/7 అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సమాచారం అందిస్తూనే, అందుబాటులో ఉంటారన్నారు. సమస్య ఎక్కడున్నా అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించేందుకు చర్యలు చూపిస్తారని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వివరించారు.ప్రజలను సురక్షిత మార్గాలకు తరలించడం, అవసరమైన వైద్య సేవలు అందించడం, భోజన, దాహార్తి అవసరాలు తీర్చడం వంటి విషయాల్లో పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. నిడదవోలులోని తన క్యాంప్ కార్యాలయ సిబ్బంది ఈ అంశాలను సమన్వయం చేస్తూ ఉంటారన్నారు. ఏ సమస్య వచ్చినా ఎదుర్కొనేందుకు తాము సంసిద్ధంగా ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రతి ఏటా ఈ తరహా విపత్తులు సంభవిస్తూనే ఉన్నాయని, ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా ప్రమాదాన్ని అరికట్టవచ్చని మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని, దూర ప్రయాణాలు చేయకూడదని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ సూచించారు. జల కాలుష్యం జరిగే ప్రమాదం ఉందని, అంటువ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్న నేపథ్యంలో మంచినీటిని కాచి చల్లార్చి త్రాగాలని సూచించారు. చిన్నపిల్లలు ఉన్న తల్లిదండ్రులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా వైద్యశాఖ అధికారులు అవసరమైన మందులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశం చారు. హెల్త్ క్యాంపులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మారుమూల గ్రామంలో ఇబ్బందున్నా కూడా సమాచారం అందిస్తే వైద్యులు వచ్చి సేవలందిస్తారని తెలిపారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించామని, పరిస్థితి ఉద్రిక్తమైతే సెలవులు పొడిగించే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, అత్యవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాల్లో ఉంచుతామన్నారు. పశువులను ఎత్తైన ప్రదేశాల్లో కట్టి ఉంచాలన్నారు.ప్రజలు జాగ్రత్తగా ఉండి ప్రభుత్వానికి సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కోరారు.

## తీరాన్ని తాకిన మొంథా కోనసీమలో రెడ్ అలర్ట్

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో

మెంథా తుఫాన్ హెచ్చరికలు జిల్లాల ప్రజలను తీవ్రంగా వణికిస్తున్నాయి. 1996 నాటి పెను తుఫాన్‌ను గుర్తు చేసుకుని కోనసీమ వాసులు భయాందోళన చెందుతున్న పరిస్థితి. ఉమ్మడి గోదావరి జిల్లాల సముద్ర తీరం వెంబడి ఉన్న వందలాది గ్రామాల్లో కచ్చా ఇల్లు, పూరి గుడిసెల్లో ఉన్నవారిని తుఫాన్ పునరావాస కేంద్రాలకు అధికార యంత్రాంగం తరలిస్తోంది. దాదాపు 80 వేల మందిని 455 పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలుస్తోంది. కాకినాడ, తుని, అమలాపురం, రాజోలు, అంతర్వేది, సఖినేటి పల్లిలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు మోహరించాయి. ఎక్కడైనా ఘటన జరిగితే 30 నిముషాల్లో చేరుకునేలా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. పునరావాస కేంద్రాల్లో ఆహారం తయారీ, వసతి, వైద్య శిబిరం తదితర ఏర్పాట్లు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నారు.-దిశ మారిందా... కోనసీమ గజగజ...

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మెంథా తీవ్ర తుఫానుగా మారిందని ప్రస్తుతానికి మచిలీపట్నం-కాకినాడలో తుఫాను కేంద్రీకృతమైందని ఈ మేరకు ప్రఖర్ జైన్ ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం రాత్రికి కాకినాడ-మచిలీపట్నం మధ్య తీవ్ర తుఫానుగా తీరం దాటే అవశాశం ఉందని పేర్కొన్నారు. తుఫాన్ నేపథ్యంలో రాత్రి 7 గంటల నుంచి భారీ వాహనాలను జాతీయ రహదారుల్లో నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

తుఫాన్ నేపథ్యంలో ప్రజలుఅత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని అధికార యంత్రాంగం హెచ్చరించింది.అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పెనుతుఫాన్‌గా మారి మంగళవారం రాత్రి కాకినాడకు సమీపంలో తీరం దాటే సమయంలో వంద కిలోమీటర్లవేగంతో ఈదురుగాలులుఉ వీస్తాయంటూ వెల్లువెత్తుతున్న వాతావరణశాఖ హెచ్చరికలు కోనసీమ వాసుల్లో భయాందోళనలు పుట్టిస్తున్నాయి.గత తరానికి 1996 నాటి ఘోర ప్రళయం గుర్తుకొస్తోంది. మరోసారిఅలాంటి విపత్తును తాము చవిచూడాల్సిందేనన్న భయం వారిని ఆవరించింది. అయితే అప్పటి పరిస్థితులకు ఇప్పటి పరిస్థితులకు చాలా మార్పులు వచ్చాయి. సాంకేతిక విప్లవం వచ్చింది.

సమాచారం క్షణాల్లో తెలుస్తోంది. ప్రభుత్వ యంత్రాంగం కూడా మంచి ఏర్పాట్లు చేసింది. ముందస్తు చర్యలు చాలా గొప్పగా చేసారు.-పోర్టులు ఖాళీ యాంకరేజీ పోర్టుతో పాటు, కాకినాడ డీప్‌వాటర్ పోర్టును మొత్తం ఖాళీ చేశారు. ఎరువుల, పంచదార, బొగ్గు, గ్రానైట్, వంటనూనె,బియ్యంనిల్వలతో ఉన్న 15 నౌకలను సముద్రంలోనే సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## ప్రకృతి వైపరీత్యాలు వల్ల ప్రాణ ఆస్తి నష్టాలకు తావు లేకుండా పనిచెయ్యాలి

**మొదటిపేజి తరువాయి**

సహాయాన్ని, మత్స్యకార నిర్వాసితులకు ఉచితంగా 25 కేజీల బియ్యాన్ని అం దించి ఇంటికి బాధితులను పంపించాలన్నారు. ప్రత్యేక అధికారులు జిల్లా కలెక్టర్ సూచనలతో జనరేటర్లు అవసరమైన చోట ఏర్పాటు చేసుకొని వాటికి అవస రమైన డీజిల్ను కూడాసరఫరా చేస్తామన్నారు తెలిపారు. ఎవరికి ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు చేపట్టాలన్నారు జిల్లాలో నిరాశ్రయులైన వారందరికీ ఆర్థిక సహాయం అందించాలన్నారు. తుఫాన్ అనంతరం రోడ్ల పడిపో యిన చెట్లు తొలగిస్తూ రాకపోకలు, అదేవిధంగా నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు నెలకొల్పి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించా లన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు జిహరీష్ మాధుర్, స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు, ముమ్మిడివరం శాసనస భ్యులు దాట్ల సుబ్బరాజు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్ఓ కే మాధవి ఆర్అండ్‌బి ఆర్ డబ్ల్యు ఎస్, అగ్నిమాపక విపత్తుల స్పందన, పంచాయతీరాజ్ విభాగాల అధికారులు ఇంజనీర్లు పాల్గొన్నారు.

## సమన్వయంతో తుఫాన్‌ను సమర్ధంగా ఎదుర్కొందాం

**మొదటిపేజి తరువాయి**

తీరందాటే అవకాశం ఉన్నందున అధికారులుఅంతా అప్రమత్తంగా ఉండాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించారు. ముందస్తు రక్షణ చర్యలుగా తుపాను ముప్పు ప్రాంతాల ప్రజలనుసురక్షిత ప్రాంతాలకు తరలించా మని ప్రజలకు ధైర్యం చెప్పారు.అధికారులు సమన్వయంతో పనిచేసిప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ పునరావాస కేంద్రంలో వైద్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా వృద్ధులకు, పిల్లలకు, గర్భిణీ స్త్రీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. తుఫానును సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందన్నారు.

సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రొట్టెలు, దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ

తుఫాను పునరావాస శిబిరాల్లో ఉన్న బాధితులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం సమకూర్చిన దుప్పట్లు,రొట్టెలు, బిస్కెట్ ప్యాకెట్లు, తినుబండారాలు పంపిణీ చేశారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా ఈ వస్తువులు పంపిణీ చేసినట్టు సత్యం తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ పాలు పంచుకుంటుందన్నారు. ఈ వస్తువుల కిట్టును మంత్రి సుభాష్, పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు, కూటమి నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అపార అనుభవం ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ముందస్తుగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘాట్ రోడ్‌లో వాహనాల రాకపోకలు నిలిపివేత



రంపచోడవరం,మేజర్‌న్యూస్ :తుఫాను ముందస్తు చర్యలో భాగంగా ఘాట్ రోడ్‌లలో వాహనాల రాకపోకలు మంగళవారం రాత్రి నుంచి నిలిపివేసినట్టు రంపచోడవరం సిఐ ఎన్ సన్యాసి నాయుడు తెలిపారు. తుఫాను తీవ్రత దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు సాయంత్రం 6 గంటల తర్వాత రోడ్లపై వాహనాలు తిరగకూడదని, అత్యవసర సేవలు తప్ప ఎవరూ బయట తిరగకూడదన్నారు.తుఫాను తీవ్రత తగ్గేవరకు ప్రజలు సురక్షితంగా ఇళ్లలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మంగళవారం సాయంత్రం 6గంటలనుండి రంపచోడవరం నుండి చింతూరు వెళ్లే ఘాట్ రోడ్డు తాత్కాలికంగా మూసివేయబడిందని,ఎటువంటి వాహనాలను అనుమతించడం జరగదన్నారు. తుపాను ప్రభావం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, చింతూరు,రంపచోడవరం డివిజన్లలో అధికంగా ఉంటుందని ఆర్‌టిజిఎస్ హెచ్చరికలు జారీ చేసిందన్నారు.ఈనేపథ్యంలో జిల్లాలో రాత్రి నుండి మరలా ఆదేశాలు వచ్చేవరకు ఘాట్ రోడ్‌లో వాహనాల రాకపోకలు నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుండి వెళ్లే జాతీయ రహదారి సహా అన్ని రహదారులపై ట్రాఫిక్ ఆంక్షలు జారీ చేయడం జరిగిందన్నారు.అయితే,అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లేవారికి మాత్రం మినహాయింపు ఉంటుంది అని తెలిపారు.అల్లూరి జిల్లాల్లో గ్రామాల్లో వాగులు పొంగుతున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ, అత్యవసర సమయంలో తప్ప బయటకి రావద్దని కోరారు...కావున ప్రజలు మరియు ప్రయాణికులు గమనించగలరు, ప్రత్యామ్నాయ రూట్స్ చూసుకోవాలి అని తెలియజేసారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సుడిగాలి పర్యటన

– సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం
– అర్ధరాత్రి పునరావాస కేంద్రాలు పరిశీలన



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో 'మొంథా' తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో గత రెండు రోజులుగా కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సుడిగాలి పర్యటన చేస్తూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తుఫాను ప్రభావం అధికంగా ఉన్న పిఠాపురం కాకినాడ నగరం, కాకినాడ రూరల్, తుని నియోజవర్గాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు పర్యవేక్షించడంతో పాటు, అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. అలాగే కాకినాడ జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించడంతోపాటు సౌకర్యాలపై ఆరా తీస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి యు.కొత్తపల్లి మండలంలో పలు పునరావాస కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు, అలాగే మంగళవారం యు కొత్తపల్లి మండలంలో పర్యటించి ఉప్పాడ జడ్పీ హైస్కూల్, మూలపేట ప్రాథమిక పాఠశాల, అమీనాబాద్ చర్చి, కోన పాప పేటలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులకు స్వయంగా ఆహారాన్ని వడ్డించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు, అలాగే తుని నియోజకవర్గం తొండంగి మండలం గడ్డి పేట పాఠశాలలో ప్రభుత్వం వలస కార్మికులకు ఏర్పాటుచేసిన పునరావస కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్యతో కలిసి పరిశీలించారు, అలాగే గొల్లప్రోలు లో టోల్ ప్లాజా వద్ద గొర్రికండి కాలువ ఏలేరు నీటి ప్రభావంతో గండిపడే అవకాశం ఉన్నందున స్థానిక రైతుల విజ్ఞప్తి మేరకు పరిశీలించి గండి పడకుండా తక్షణం తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కాకినాడ రూరల్ మండలం వాకలపూడి జడ్పీ హైస్కూల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి పరిశీలించి, బాధితులకు అందిస్తున్న ఆహారం, ఇతర సౌకర్యాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఒకవైపు సుడిగాలి పర్యటన చేస్తూనే, ఎప్పటికప్పుడు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను రక్షించేందుకు చేపట్టాల్సిన సహాయ చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సమీక్షలు నిర్వహిస్తున్నారు. మరోవైపు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు కాకినాడ క్యాంప్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, రెండు మొబైల్ నంబర్లు అందుబాటులో ఉంచామని ఎవరికి ఏ సహాయం కావాలన్నా 24/7 99811 99811, 90638 01432 నెంబర్లలో సంప్రదించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# మండలంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించిన అధికారులు







– శరభవరంలో పాకపై చింత చెట్టు కూలి మేక మృతి

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని 516ఇ దూసరపాము జాతీయ రహదారిపైఅడ్డంగా పడివున్నతాడి చెట్టును మండల స్పెషల్ ఆఫీసర్ అంబేద్కర్, ఎంపీడీవో యాదగిరిశ్వరరావు, తాసిల్దార్ సత్యనారాయణఆధ్వర్యంలో ఎంపీటీసీ సత్తిబాబు సహకారంతో మంగళవారం ఉదయం తొలగించారు. అలానే లబ్బర్తి, అనంతగిరి రహదారి మధ్యలో పడి ఉన్నచెట్టును స్థానిక సీఐ గౌరీ శంకర్, ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. మండలంలోని శరభవరం పంచాయతీ వనకరాయి గ్రామంలో పప్పుల పకీరయ్య పశువులపాకపై భారీ చింత చెట్టు పడిపోవడంతో పాకలోని మేక అక్కడికక్కడే మృతి చెందింది. తాసిల్దార్ సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని సందర్శించి సహాయ చర్యలు చేపట్టారు.

# మౌంథా తుఫాన్ నేపథ్యంలో ఏలేరు జలాశయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సత్యప్రభ..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** మౌంథా తుఫాన్ ప్రభావం కారణంగా ఏలేశ్వరం పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో, స్థానిక ఎమ్మెల్యే సత్యప్రభ అధికారులతో కలిసి మంగళవారం ఏలేరు జలాశయాన్ని సందర్శించారు. తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని, జలాశయ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆమె, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ, ఎగువ ప్రాంతాల నుండి భారీ స్థాయిలో వరద నీరు ఏలేరు జలాశయానికి చేరుతోంది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యగా దాదాపు 5000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉంది అన్నారు.ప్రజలు లేదా రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం అన్ని విభాగాల సమన్వయంతో అప్రమత్తంగా పనిచేస్తోందని, నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని ఎమ్మెల్యే వివరించారు.ఎమ్మెల్యేగా తాను స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నప్ప టికీ, అధికారులు కూడా సమయాను సారంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె ఆదేశాలు చేశానన్నారు.. ప్రజల భద్రత, ఆస్తి రక్షణే మా ప్రభుత్వ ప్రాధాన్యత," అని సత్యప్రభ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి ఎమ్మెల్యే సత్య ప్రభ..




**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** మౌంథా తుపాను ప్రభావం నేపథ్యంలో ఏలేశ్వరం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ విస్తృతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం చేపడుతున్న ప్రమాద నివారణ చర్యలను సమీక్షిస్తూ, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో అత్యవసర సేవలను వేగంగా అందించాలనే దిశగా సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రాధాన్యం అని అన్నారు. తుపాను సమయంలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, ప్రతి శాఖా అధికారి అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్, త్రాగునీరు, రహదారులు, వ్యవసాయం, ఆరోగ్యం, పశుసంవర్ధక, రెవెన్యూ, పోలీస్ తదితర విభాగాల అధికారులు ఈ సమావేశానికి హాజరై ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర నివేదికలను ఎమ్మెల్యే సమక్షంలో సమర్పించారు. ప్రజలలో అపోహలు, ఆందోళనలు వ్యాపించకుండా అధికారులు సమయానుకూల సమాచారాన్ని అందించాలనీ, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు, వైద్య బృందాలు, అత్యవసర వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించేందుకు ప్రభుత్వం అన్ని రకాల సన్నాహాలు చేసిందని, ప్రతి కుటుంబం సురక్షితంగా ఉండేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. తుపాను పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలతో పాటు ఉందని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీవో, తహసీల్దార్, విద్యుత్, రోడ్లు, పంచాయతీ రాజ్, వ్యవసాయం, ఆరోగ్య, పశు సంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం అప్పనపాలెం వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే సత్యప్రభ



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం మండలంలోని అప్పనపాలెం వంతెన ఐదు సంవత్సరాల క్రితం వచ్చిన భారీ వరదలకు కూలిపోయింది. అప్పటి నుండి చుట్టుపక్కల సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే సత్యప్రభ అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడమే కాకుండా, సంబంధిత మంత్రులను స్వయంగా కలిసి వంతెన పునర్నిర్మాణం అవసరాన్ని వివరించారు. తుఫాన్ నేపథ్యంలో ఏలేరు జలాశయం నుండి వరద నీరు విడుదల అవుతుండటంతో, వంతెనపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ భద్రత అత్యంత ముఖ్యమని, పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు వంతెనపై రాకపోకలను నిలిపివేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని, వంతెన పునర్నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులతో కలిసి వంతెన పరిసర ప్రాంతాలను పరిశీలించి, అవసరమైన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు .

సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ప్రజల భద్రతే ప్రధమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది

**- శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజల భద్రతే ప్రధమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలతో, ఎటువంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రజలు, ప్రభుత్వానికి సహకరిస్తూ, అధికారులు ఇచ్చే సూచనలు పాటిస్తున్నారని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. మొంధా తుఫాన్ కారణంగా రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ముంపుకు గురైన ప్రాంతాలను శాసనసభ్యులు వనమాడి కొండబాబు ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి డివిజన్ నందు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలు అందించడం జరుగుతుంది. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మొంధా తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి విపత్కర పరిస్థితులన్కెనా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం యంత్రాంగం పూర్తి సిద్ధంగా ఉన్నదని, పరిస్థితిని అధికారులతో కలిసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడం జరుగుతుందని, చెట్లు పడిపోవడం, నీరు నిలిచిపోవడం వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందని, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాలతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేసి ఫిర్యాదు వచ్చినా వెంటనే పరిష్కారం చేయడం జరుగుతుందని, ముంపుకు గురైన ప్రాంత ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాల నందు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, మరొక రెండ్రోజుల వరకు ప్రజలు తమ ఇళ్లలో మంచినీరు, పాలు, బిస్కెట్లు ఇతర నిత్యావరాలు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఆమన్ జైన్, అరదాడి శివ, అంగాడి దుర్గారావు, ఎరిపిల్లి రాము, తెప్పల రామలింగేశ్వరరావు, గొరుసు దుర్గారావు, గెద్దం పూర్ణచంద్రశేఖర్, పాలిక నాని, శ్రీనివాస్ చౌదరి, తాడిచర్ల వెంకటేశ్వరరావు, మూగు రాజు, మోస పేతురు, చొడుపిల్లి సతీష్, మాదే ఆంద్రియ, కొడుకులపూడి శ్రీనివాస్, పినపోతు జీవారత్నం, పినపోతు రాము, పట్టా ధనలక్ష్మి, పాలిపు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా నామవరం డి-బ్లాక్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ కీర్తి చేకూరి ఈరోజు తనిఖీ చేశారు. వర్షాలు, తుపాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను సురక్షిత ప్రదేశాలకు తరలించి ఏర్పాటు చేసిన వసతులను ఆమె పరిశీలించారు. కేంద్రంలో తాగునీరు, ఆహారం, విద్యుత్, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ కీర్తి చేకూరి పునరావాస కేంద్రంలో నివసిస్తున్న కుటుంబాలతో ముఖాముఖి సంభాషణ జరిపి వారి అవసరాలను తెలుసుకున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు సౌకర్యంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. అవసరమైన వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్శనలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే. భాస్కర్ రెడ్డి, మండల స్పెషల్ అధికారి కే. ఎన్. జ్యోతి, ఎంపీడీవో, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ "ప్రజల భద్రతకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. అవసరమైతే అదనపు పునరావాస కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తాం. ప్రతి అధికారి తన పరిధిలో అప్రమత్తంగా ఉండాలి" అని పేర్కొన్నారు.

## మాదిగ దండోరా కాలనీలో సొంత నిధులతో రోడ్డు వేయించిన సుంకవిల్లి (సీఎం)



**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామ మాదిగ దండాల కాలనీలో ముంతా తుఫాన్ ఎఫెక్ట్‌తో కాలనీలో రోడ్డు అస్తవ్యస్తంగా తయారై డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండి దుర్గన్న పరిస్థితుల్లో ఉన్న కాలనీవాసులకు యల్లమిల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ (యల్లమిల్లి సీఎం) సొంత నిధులతో రోడ్డు వేయించి డ్రైనేజీలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మా ప్రియతమ నాయకులు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్ఫూర్తితో గ్రామంలో తుఫాన్ ఎఫెక్ట్తో ఇబ్బంది పడుతున్న మాదిగదండోరా కాలనీ వాసులను అన్ని విధాల ఆదుకోవాలనిఉద్దేశంతో ఈకార్య క్రమం చేపట్టడంజరిగిందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ గణపతి, గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చీకట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ ఆందోళన చెందవద్దు - అప్రమత్తంగా ఉండండి

**- కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది**
**- తుఫాను ప్రభావంపై నిరంతర పర్యవేక్షణ**
**- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తుఫాను పరిస్థితులు దృష్ట్యా ప్రజలందరూ ఆందోళన చెందవద్దని, అప్రమత్తంగా ఉండాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపు ఇచ్చారు. ప్రస్తుతం తుఫాను తీరం దాటే సమయంలో గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని ఆయన సూచించారు. కుటుంబంలో బంధువులు మృతి చెందిన కారణంగా అత్యవసరంగా హైదరాబాద్ వెళ్ళాల్సి వచ్చినప్పటికీ, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రజల భద్రతపై నిరంతర దృష్టి సారించారు. హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మరియు సంబంధిత శాఖల అధికారులతో టెలిఫోన్ ద్వారా మాట్లాడి తుఫాను ప్రభావం, వర్షపాతం, గాలుల తీవ్రత, పునరావాస కేంద్రాల ఏర్పాట్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజల తరలింపు, అవసరమైన సౌకర్యాలు మరియు సహాయక చర్యలపై సమీక్ష జరిపారు. అందిన వివరాల ప్రకారం, తుఫాను ప్రభావిత మండలాల్లో అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ప్రతి పునరావాస కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఆహారం వంటి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరియు పాడైన ఇళ్లలో నివసిస్తున్న వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సురక్షిత కేంద్రాలకు వెళ్లాలని ఎమ్మెల్యే గోరంట్ల విజ్ఞప్తి చేశారు. తుఫాను సమయంలో అవసరం లేని ప్రయాణాలు చేయకూడదని, స్థానిక అధికారుల సూచనలు తప్పక పాటించాలని సూచించారు.
ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ మరియు మంత్రులు తుఫాను ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, కూటమి ప్రభుత్వం ప్రజల భద్రత కోసం అన్ని విధాల అండగా ఉంటుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.

## మినపపంటలు పరిశీలించిన వ్యవసాయ అధికారులు





**గండేపల్లి, మేజర్ న్యూస్ :** తాళ్లూరు మరియు ఎల్లమల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ద్వారా మంగళవారం మెంతా తుఫాన్ కారణంగా పడినటువంటి వర్షాలకు దెబ్బతిన్న మినప చేను సందర్శించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె.లక్ష్మి మాట్లాడుతూ గండేపల్లి మండలంలో 1037 ఎకరాల్లో సాగుతున్న టువంటి మినుము పంటలో ఇప్పటికీ 200 ఎకరాలు సాగు పూర్తినప్పటికీ 800 ఎకరాలు సాగు వర్షానికి గురవుతున్నట్లు ప్రస్తుతానికి అంచనా వేయడం జరిగింది. అందులో భాగంగా ఎల్లమిల్లి, తాళ్లూరు గ్రామాల్లో సందర్శించినప్పుడు అక్కడక్కడ మినుము మొక్కలు గింజల నుంచి రావడం గమనించడం జరిగింది. దానికి శాస్త్రవేత్తలను సలహా మేరకు వర్షం తగ్గిన తర్వాత 5 % ఉప్పు ద్రావణాన్ని పైర్ మీద చేసుకుంటే మొలక శాతం తగ్గుతుందని సూచించారు దీనిని రైతులు గమనించి వర్షం తగ్గుముఖం పట్టగానే మీరు ఈ పిచ్చి గారిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎల్లమిల్లి మరియు తాళ్లూరు రైతులు ఏఈఓ చంద్రమౌళి, శ్రీను, లావణ్య పాల్గొన్నారు

## పి.వేమవరంలో విరిగిన విద్యుత్ స్తంభం తక్షణమే కొత్త స్తంభం అమర్చిన సిబ్బంది



**పెరవలి, మేజర్ న్యూస్ :** మొంతా తుఫాను ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం పిట్టల వేమవరం గ్రామంలో అక్టోబర్ 28వ తేదీ మంగళవారం విద్యుత్ స్తంభం విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలిసిన పెరవలి విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం డేవిడ్ నిచ్చల్ తన సిబ్బందితో కలిసి హుటాహుటిన పిట్టలవేమవరం గ్రామానికి వచ్చి విరిగిపడిన విద్యుత్ స్తంభం ప్లేస్ లో కొత్త విద్యుత్ స్తంభాన్ని అమర్చారు. ఈ సందర్భంగా ఏఈ ఎం డేవిడ్ నిచ్చల్ మేజర్ న్యూస్‌తో మాట్లాడుతూ పెరవలి మండల వ్యాప్తంగా తమ బృందాలు పర్యటిస్తున్నాయని మండలంలో ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు విరిగిన విద్యుత్ లైన్ల పై చెట్లు విరిగిపడ్డ తమకు సమాచారం అందిస్తే యుద్ధ ప్రాతిపదికన తాము వాటిని పునరాదిస్తామని ముందు జాగ్రత్త చర్యగా కొత్త విద్యుత్ స్తంభాలు సిద్ధంగా ఉంచామని అన్నారు.

## పచ్చని చెట్టుగా మారిన కరెంటు ట్రాన్స్ఫార్మర్ స్తంభం

**- మూడు సంవత్సరాలుగా పట్టించుకోని విద్యుత్ అధికారులు**



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామంలో ఊరికి దగ్గరగా ఒక కరెంటు ట్రాన్స్ఫార్మర్ స్తంభం పచ్చని చెట్టుగా మారింది. స్థానిక ప్రజలు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఈ స్తంభానికి పచ్చని తుప్పలు పాదులు పట్టి కరెంటు స్తంభం నుంచి ఎప్పుడూ నిప్పు రవ్వలు రాలుతూ భయాందోళనలు కలిగిస్తుందని ఎవరైనా పిల్లలు గాని వెళ్లి చెట్టు అని పట్టుకుంటే కరెంటు షాక్ కొట్టే పరిస్థితి ఉందని ముఖ్యంగా ముంతా తుఫాను నేపథ్యంలో స్తంభం అంత విద్యుత్ సరఫరా అవుతుందని వెంటనే సంబంధిత ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మొంథా తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి




**– మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో మంత్రికి కందుల దుర్గేష్ అధ్యక్షతన అత్యవసర సమీక్షా సమావేశం**
**– జిల్లా అధికార యంత్రాంగానికి, ప్రజలకు పలు సూచనలు చేసిన మంత్రి కందుల దుర్గేష్**
**– రానున్న మూడు రోజుల పాటు అధికారులు 24x7 విధుల్లో ఉండాలని ఆదేశాలు జారీ**
**– విపత్తు నిర్వహణ ఎదుర్కొనే విషయంలో యువతకు శిక్షణ ఇచ్చి ఆ బృందాలను గ్రామాల్లో సేవలందించేలా చర్యలు తీసుకోవాలని సూచన**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తతతో ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా తూర్పు గోదావరి జిల్లా అధికారులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మంత్రి కందుల దుర్గేష్, జిల్లా ప్రత్యేక అధికారి కె. కన్నబాబు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ు "విపత్తు ముందు, విపత్తు తర్వాత అధికారులు పూర్తిస్థాయి సన్నద్ధతతో ఉండాలి. రహదారులపై గండ్లు పడటం, చెట్లు కూలడం, ముంపు ప్రాంతాలు వంటి సమస్యలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో 'ఏమీ జరగదు' అనే నిర్లక్ష్య భావం ఉండకూడదు. స్థానిక యువత, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయంగా పనిచేయాలి. ఈ సందర్భంగా విపత్తు నిర్వహణ ఎదుర్కొనే విషయంలో యువతకు శిక్షణ ఇచ్చి గ్రామాల వారీగా బృందాన్ని సిద్ధం చేసుకోవాలి. పశుసంపదను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రతి శాఖ సమయానికి స్పందించి ప్రజల భద్రతను కాపాడాలి. రానున్న మూడు రోజుల పాటు అధికారులు 24x7 విధుల్లో ఉండాలి. భవిష్యత్తులో ఇటువంటి విపత్తులు ఎదురైనప్పుడు ప్రజల్లోకి సమర్థవంతంగా అవగాహన తీసుకెళ్లేందుకు జిల్లా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం పై దృష్టి సారించాలని మంత్రి దుర్గేష్ సూచించారు. విపత్తు సమయంలో స్పందన, సహాయక చర్యలు, పునరావాసం వంటి అంశాలు సమన్వయంతో సాగాలన్నారు.

**–అప్రమత్తంగా చర్యలు**

**– జిల్లా సహాయక చర్యల ప్రత్యేక అధికారి కె. కన్నబాబు**

జిల్లా ప్రత్యేక అధికారి కె.కన్నబాబు మాట్లాడుతూ "ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ, బురద కాలువలలో నీటి ప్రవాహ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలి. అవసరమైతే రిజర్వాయర్ల దిగువకు నియంత్రితంగా నీటిని విడుదల చేయాలి. రహదారులపై గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలి. వానరబుల్ ఏరియాస్ గుర్తించి, అక్కడ ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు సిద్ధం చేయాలి. రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా అన్ని విభాగాల సమాచారాన్ని సమీకరించి విపత్తు నిర్వహణ యంత్రాంగం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గాలి వేగంగా వీచే అవకాశం ఉన్నందున విద్యుత్, టెలికం శాఖలు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. అవసరమైతే డ్రోన్ టెక్నాలజీ ద్వారా మందులు, ఆహార సరఫరా చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు."

**–ప్రజల భద్రత మా ప్రాధాన్యత – కలెక్టర్ కీర్తి చేకూరి**

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ "తుఫాన్ తీరం దాటే సమయంపై ఖచ్చితమైన సమాచారం కోసం వాతావరణ శాఖ సూచనలను ప్రతి నిమిషం అనుసరించాలి. ఏ సమయంలోనైనా ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ూూూ ప్రకారం శాఖల వారీగా చర్యలు అమలు చేయాలి.ప్రతి గ్రామ సచివాలయ స్థాయిలో అప్రమత్తత సూచనలు ఇచ్చాం. పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉంచాం. మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాం. అవసరమైన ఆహారం, త్రాగునీరు, డ్రై రేషన్, వైద్య సదుపాయాలు అందుబాటులోఉంచాం.రక్షణ చర్యలన్నీ డాక్యుమెంటేషన్ రూపంలో నిర్వహించాలని సూచించాం. పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు."

**–అప్రమత్తంగా ఉండాలి**

**– పోలీస్ సూపరింటెండెంట్ డి. నరసింహ కిషోర్**

ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ "తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు పహారా విధులు కట్టుదిట్టం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లకు సూచనలు జారీ చేశాం. ఎస్డీఆర్ఎఫ్, ఫైర్, పోలీస్ శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలి. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా ఉండాలి. కంట్రోల్ రూమ్ లు 24x7 పనిచేస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయం అందించేందుకు బృందాలు సిద్ధంగా ఉన్నాయి" అని తెలిపారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ ు "కొత్త చెరువు వద్ద 10 ఏళ్ల క్రితం గండి పడిన ప్రాంతంలో ముందస్తు చర్యగా 1000 ఇసుక బస్తాలతో రక్షణ ఏర్పాట్లు చేశాం. క్రాప్ కోతకు సంబంధించిన ముంపు ప్రాంతాల్లో నీటి నిలువ లేకుండా చర్యలు తీసుకున్నాం" అని తెలిపారు.

ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్ మాట్లాడుతూ "పునరావాస కేంద్రాల్లో వేడిగా ఆహారం అందుబాటులో ఉంచాం. మైనర్ ఇరిగేషన్ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

**– ప్రజలకు భరోసాగా నిలుద్దాం**
**– జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు మంత్రి సుభాష్ ఆదేశాలు**



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని, అలాగేప్రజల్లో భయాందోళనలు లేకుండా జిల్లా యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ రావిరాలకు సూచించారు. తుఫాను సహాయక చర్యల్లో భాగంగా మంత్రి సుభాష్ కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రిగా అధికారులతో మంగళవారం ఉదయం సమీక్షించి తదనంతరం కోనసీమ జిల్లాలో పలు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్ కు పలు సూచనలు చేశారు. వాయుగుండం నేటి రాత్రికి తీవ్ర తుఫానుగా మారనుందని, ఆ సమయంలో ఎక్కడా ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే పునరావాస శిబిరాల్లోఉన్న బాధితులకు నాణ్యమైన భోజనం, మంచినీరు, పాలు, అవసరమైన వారికి మందులు అందించాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలకు మెరుగైన సౌకర్యాలు అందించాలని అన్నారు. తుఫాను తీరం దాటిపోయే వరకుఅధికారులంతా అప్రమత్తంగాఉండాలని ఆదేశించారు. ఈసందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్ జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు మంత్రి సుభాష్ కు వివరించారు. అన్ని శాఖల అధికారులను సమన్వయ పరిచి సహాయక చర్యలు చేస్తున్నామన్నారు. కాట్రేనికోన,ఐ పోలవరం, సఖినేటిపల్లి, మల్కిపురం, ఉప్పలగుప్తం, కొత్తపేట మండలాల్లో సుమారు 7000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించమన్నారు. తీర ప్రాంతాల్లో మెరైన్ పోలీసులతో పాటు సుమారు 150 గ్రామసచివాలయంలో ఉన్న మహిళా పోలీసులతో గస్తీ నిర్వహించమన్నారు.కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు తుఫాను పరిస్థితులను అంచనా వేస్తు ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని మంత్రి సుభాష్‌కు వివరించారు.

# ఏలేరు దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఏలేరు దిగువ ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేరు జలాశయానికి ఇన్ ఫ్లో పెరిగే అవకాశం ఉందని, కావున దిగువ ప్రాంతాల్లో అధికారులంతా అప్రమత్తగా ఉండాలన్నారు. మంగళవారం ఇరిగేషన్, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లతోజగ్గంపేట మండలం ఇర్రిపాక లోని ఏలేరు ఏటిగట్లను ప్రతిష్ట పరిచే చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. ఏలేరు ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నుంచి అధిక శాతం నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలేరు, సుద్దవాగు ప్రభావిత మండలాల్లో తాహశీల్దార్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.కిర్లంపూడిమండలంలోని విఆర్ఒలు హెడ్ క్వార్టర్‌లోఉండి ఎటువంటి సంఘటన జరిగిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడా ఏ చిన్న ఇబ్బంది జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించాలన్నారు. అవసరమైన చోట రిలీఫ్ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నవీన్ ఆదేశించారు. బలహీనంగా ఉన్న గట్లను ముందే గుర్తించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముంపు ప్రాంతాల పరిధిలో గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, పిల్లలను ముందుగానే ఆసుపత్రులకు తరలించడం తోపాటు ముంపు గ్రామాల ప్రజలను రిలీఫ్ కేంద్రాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను నవీన్ ఆదేశించారు.ప్రమాద స్థాయిలో ఏలేరు నీటిమట్టంఅధికవల కురుస్తున్న భారీ వర్షాలకు ఏలేరు రిజర్వాయర్‌కు వరద నీరు చేరడంతో నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. అని ఏలేరు పరివాహ ప్రాంతాలని అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రమేష్, ఎస్సై రఘునాథరావు, భూ పాలపట్నం ప్రసాద్, జ్యోతుల సత్యమూర్తి, వీఆర్వో, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**– పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డి.జి.ఎం పవన్ కుమార్**



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పవర్ గ్రిడ్, సూరంపాలెం డీజీఎం పవన్ కుమార్ అన్నారు. అవినీతి అవగాహన వారోత్సవాల ప్రారం భోత్సవం సందర్భ ంగా ఆయన మాట్లా డుతూ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు–2025లో భాగంగా ఉద్యోగస్తులకు మరియు కళాశాల,హైస్కూల్ విద్యార్థులకు "విజిలెన్స్: మనందరి సంయుక్త భాద్యత" అనే అంశంపై వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులకు అవగాహనా సదస్సులు నిర్వహించి జాగ్రతం చేస్తున్నామని తెలిపారు. అంతకుముందు ఉద్యోగస్తులందరితో అవినీతి నిర్మూలనపై సమీకృత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు చిత్రాలేఖనం పోటీలు నిర్వహించారు.

# తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తగిన చర్యలు

**- ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి**

**- రావులపాడు, వానపల్లి శివారు సంఘంపాలెం పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను తీవ్రత దృష్ట్యా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో ముందస్తు చర్యల్లో భాగంగా రాబోయే విపత్తును ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగాన్నంతా సమాయత్తం చేయటం జరిగిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన రావులపాలెం మండలం రావులపాడు, కొత్తపేట మండలం వానపల్లి శివారు సంఘంపాలెంలోని తుఫాను పునరావాస కేంద్రాలను ఆర్డీవో శ్రీకర్ తదితరులతో కల్సి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పూరి గుడిసెలు,రేకు షెడ్లలో,శిథిలమైన ఇళ్లలో ఉంటున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 111చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రావులపాలెం మండలంలో 42చోట్ల, ఆత్రేయపురం మండలంలో 21చోట్ల, ఆలమూరు మండలంలో 22చోట్ల, కొత్తపేట మండలంలో 26చోట్ల పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు.నియోజకవర్గానికి సంబంధించిన ప్రజలే కాకుండా వేరే జిల్లాలకు చెందిన ప్రజలను సైతం పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. రావులపాడు పునరావాస కేంద్రంలో నంద్యాల జిల్లాకు చెందిన 90కుటుంబాల వారు ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నవారికి స్వయంగా భోజనం వడ్డించారు. శిథిలమైన ఇళ్లలో ఉన్నవారు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని, అందుకు ఇష్టపడకపోతే కనీసం వారి బంధువుల ఇళ్లకు అయినా వెళ్లాలని సూచిస్తున్నట్లు తెలిపారు. చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వృద్ధులు, వ్యాధిగ్రస్తులు కావలసిన మందులను దగ్గర ఉంచుకోవాలన్నారు.మంగళవారం రాత్రి తుఫాను తీరం దాటనున్న నేపథ్యంలో అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం జరగకుండా అధికారులు చూసుకోవాలన్నారు.తుఫాను ప్రభావాన్ని తక్కువగా అంచనా వేసి విధుల్లో ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని పేర్కొన్నారు. అధికారులతో పాటు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ అప్రమత్తంగా ఉన్నారన్నారు. ఇప్పటికే విపత్తును ఎదుర్కోవడానికి అందరూ సమిష్టిగా కృషి చేస్తున్నారన్నారు. ఎవరికైనా ఏ అవసరం వచ్చినా స్వయంగా ఫోన్ లో ఈ నంబర్లలో 9849243777, 80082 43777 తనను సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, పల్లి భీమరావు, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలలను సందర్శించిన డిపిఈ రామకృష్ణ

**- తుఫాను సమయంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సంరక్షణకు రైతులకు అందించిన తగిన మెలుకువలు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** అక్టోబర్ 28వ తేదీ మంగళవారం జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ ప్రకృతి వ్యవసాయ పొలాలు మరియు రసాయనిక వ్యవసాయ పొలాలు సందర్శించి తుఫాను బారిన పడకుండా పంట నష్టాన్ని నుండి అధికమించడానికి మల్లేశ్వరం, పిట్టల వేమవరం, ఖండవల్లి రైతులకు తగిన మెలుకువలు చెబుతూ క్షేత్రస్థాయి పర్యటన చేశారు.ఈ కార్యక్రమంలో వరి పొలాలలో తుఫాన్ మరియు అధిక వర్షాలకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. పంటలో కాలువలు ఏర్పాటు చేసుకుని నీటిని బయటకు పంపి నేలను,పంట ను ఆరబెట్టాలి.మెచ్యూరిటీ కంకెలు ఉన్న పంట పడి పోయినచో 5%ఉప్పు ద్రావణం అంటే 50 గ్రాములు ఉప్పు 1 లీటర్ వాటర్ కి కలిపి పిచికారీ చేస్తే మొలక రాదు. లేతగా ఉద్చిన పంటలో తెగుళ్లు రాకుండా పుల్లటి మజ్జిగంఇంగువ ద్రావణం కొట్టించండి, దోమ ప్రాబ్లం కొరకు తూటి కాడంఇంగువ ద్రావణంకొట్టించండి,బలానికి చేపబెల్లం ద్రావణం/పంచగవ్య కొట్టించండి.

ఈ విధంగా చేయడం వల్ల పంటను వరదల నుంచి రక్షించవచ్చు అని వివరించారు. ఈ కార్యక్రమంలో ముక్కామల గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు అక్కిన కాశీ విశ్వేశ్వరరావు, మల్లేశ్వరం యూనిట్ ఇన్చార్జ రాముడు, ఖండవల్లి ఇంచార్జ్ వెంకట్రావు రైతులతో మాట్లాడుతూ ఈ వృద్ధి ద్రావణాలు అందుబాటులో పెట్టామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మధుబాబు సూర్యనారాయణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను నేపథ్యంలో వరి, పత్తి పంటలపై రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించిన ఏవో చక్రధర్



రాజవొమ్మంగి, మేజర్న్యూస్ : మొంథా తుఫాన్ విజృంభిస్తున్న నేపథ్యంలోరాజవమ్మంగి మండలం లోని గ్రామాల్లో రైతులు వరి, పత్తి పంటలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ అధికారి చక్రధర్,సిబ్బంది రైతులకు మంగళవారంఅవగాహన కల్పించారు.తుఫాను నేపథ్యంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. మండలంలో వరి 6830 ఎకరాల పంట పండి ఉన్నధి, ప్రస్తుతం కంకులు యెర్పడే దశ(పనికల్ ఇన్నిటియేషన్) లో వరి పొలలు ఉన్నవి, అధిక వర్షాలు పడిన యడల, రైతులు ముఖ్యంగా తీసుకోవల్సిన జాగ్రత్తలు,

1. ముందుగ నీరు నిలబడకుండా నీరు బయటకి పోయేలా బోదెలు ఏర్పటు చేసుకోవాలి. 2. నీరు అంత బయటికి పోయిన తరువత బూస్టర్ డోస్ గా 20కిలోల యూరియా మరియు 20కిలోల పొటాష్ ను ఒక ఎకరా పొలంకు వేసుకోవాలి,

3. తెగుల్లు ఉధృతి పెరగకుండ ఎకరాకు 200ఎంల్ ప్రొపికోనజోల్ మంధును 200 లీటర్లు నీటిలో కలుపుకుని పిచికారి చేసుకోవాలి.

అలానేకాటన్ పంటలో తీసుకోవల్సిన జాగ్రతలు

1. నీరు పంట పొలాలనుండి బయటికి పోయే విధంగా కాలవలు తీసుకోవాలి,

2. నీరు బయటకి పోయాక, 20 కిలోలయూరియా మరియు 10-15 కిలోల పొటాష్ ఒక ఎకరం పొలం కు వేసుకోవాలి

3. పూత, పింధే, కాయ రాలుట నివారణానికి నాఫ్థిలిన్ అసిటిక్ ఆమ్లం 1ఎంల్ /4.5 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి

4. అధిక వర్షాలు వలన పైరులో మెగ్నిషియం లోపం వల్ల ఆకులు యెర్రబడి యెండి రాలిపోతాయి, నివారణకై మేగ్నిషియం సల్ఫేట్ 10గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

5. కాటన్ పంటలో కాయ కుళ్ళి తెగులు మరియు ఆకు మచ్చ తెగులు నివారనకై 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ ను ఒక లీటర్ నీతిలో కలిపి పిచికారి చేసుకోవాలని చక్రధర్ రైతులకు సూచించారు.

## కోలంక, గొల్లపాలెంలో కూలిన భారీ చెట్లు

**- సహాయక చర్యల్లో పాల్గొన్న మంత్రి సుభాష్**



**కాజులూరు, మేజర్ న్యూస్ :** తుఫాను ప్రభావంతో భారీగా వీచిన బలమైన గాలులకు రామ చంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం కోలంక, గొల్లపాలెం గ్రామంల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అదే సమయంలో కోలంక రోడ్లో ప్రయాణిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అప్రమత్తమై అధికారులను పిలిపించి దగ్గరుండి, చెట్టును తొలగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి దగ్గరుండి సహాయకచర్యలో పాల్గొనడంతో ఆగ మేఘాల మీద చెట్టును యంత్రాలతో తొలగించారు. అలాగే గొల్లపాలెంలో కూడా చెట్లు కూలడంతో మంత్రి సుభాష్ అధికారులను అప్రమత్తం చేసి దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మండలంలోని పలు పునరావాస కేంద్రాలను సందర్శించి ప్రజలకు ధైర్యం చెప్పారు. విపత్కర పరిస్తితులను ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

## మోంథా తుఫానుపై అప్రమత్తంగా ఉండాలి ఉద్యాన శాఖ అధికారి దివ్యశ్రీ



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** 'మోంత' తుఫాను ప్రభావంతో అధిక గాలులు,భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ,జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మండల ఉద్యాన శాఖ అధికారి కె దివ్యశ్రీ, మంగళవారం పలు గ్రామాల్లో పంటలను సహచర సిబంధితో పరిశీలించారు. తీవ్రమైన గాలులు, అధిక వర్షాలుతో అక్టోబర్ 27 న కాకినాడ సమీపంలో ముంతా తుఫాన్ తీరందాటే అవకాశం ఉన్నందున,రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యానవన పంటలైన అరటి, బొప్పాయి, మరియు కూరగాయలకు రైతులకు తుఫాన్ వల్ల సంభవించే నష్టాన్ని నివారించడానికి రైతులు తక్షణమే ఈ క్రింది రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.అరటి పంటకు తీసుకోవలసిన రక్షణ చర్యలు వివరించారు. గెలలు ఉన్న మరియు ఎత్తుగా పెరిగిన అరటి చెట్లకు వెదురు కర్రలు, లేదా కలప స్తంభాలతో రెండు వైపులా గట్టిగా ఊతం ఇవ్వాలని తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న గెలలను అవకాశం ఉంటే కోసి సురక్షితమైన ప్రదేశానికి తరలించాలన్నారు.

గాలి తాకిడిని తగ్గించడానికి ఎండిన లేదా పూర్తిగా వంగిపోయిన పాత ఆకులను జాగ్రత్తగా తొలగించాలని తోటల్లో నీరు నిలవకుండా ఉండేందుకు మురుగు కాలువలను లోతుగా త్రవ్వి సిద్ధం చేయాలన్నారు. బొప్పాయి పంట పట్ల అప్రమత్తంగా ఉండాలని పక్వానికి వచ్చిన లేదా పూర్తిగా పెరిగిన బొప్పాయి కాయలను తక్షణమే కోసి భద్రపరుచుకోవాలన్నారు.మధ్య వయస్సులో ఉన్న లేదా ఎత్తుగా ఉన్న మొక్కలు గాలికి విరిగిపోకుండా బలంగా కర్రలతో కట్టాలని సూచించారు. బొప్పాయి మొక్కల మొదళ్ల వద్ద నీరు నిలవకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కూరగాయల పంటలు టొమాటో, వంకాయ, బెండ, మిరప వంటి పంటలలో కోతకు సిద్ధంగా ఉన్న కాయలు, పండ్లను తక్షణమే కోసి సురక్షిత ప్రాంతానికి తరలించాలని సూచించారు,తీగజాతి కూరగాయలు (బీర, కాకర, సొర) ఉన్న పందిళ్లు గాలికి కూలిపోకుండా, స్తంభాలను, తీగలను గట్టిగా కట్టి భద్రపరచుకోవలన్నారు. తుఫాను ముందు లేదా సమయంలో ఎలాంటి పురుగు మందులు/ఫంగిసైడ్స్ పిచికారీ చేయరాదన్నారు. ముఖ్యంగా తుఫాను ప్రభావం మొదలైన తర్వాత పొలాల్లోకి రైతులు వెళ్లడం ప్రమాదకరమని, రైతన్నలు తమ ప్రాణాలకు, పశువులకు రక్షణ కల్పించుకుంటూ, పైన తెలిపిన చర్యలను తుఫాన్ మొదలవ్వక ముందే పూర్తి చేయాలని కోరారు.ఏదయినా నష్ట సంభవిస్తే సహాయం కోసం ఉద్యాన శాఖ, అధికారులను, రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని ఏలేశ్వరం ఉద్యాన అధికారి, కె.దివ్యశ్రీ తెలిపారు.

# త్వరలో ఏరియా హాస్పిటల్ ముట్టడి



**వైద్యులపై జాతీయ ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :**వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులు, ఆదివాసీ ప్రజలు రంపచోడవరంలో త్వరలో నిర్వహించే ఆసుపత్రి ముట్టడి కార్యక్రమానికి తరలిరావాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పిలుపునిచ్చారు. రంపచోడవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన గిరిజన బాలింత బాపనమ్మ ఆమె బిడ్డ మృతికి కారుకులైన రంపచోడవరం ఏరియా ఆసుపత్రి డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు, మృతురాలు బాపనమ్మ భర్త రాజన్న దొర ఆధ్వర్యంలో జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ కు, జాతీయ మానవ హక్కుల కమిషన్ కు, జాతీయ మహిళా కమిషన్ న్యూఢిల్లీ వారికి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సమావేశంలో శ్రీను మాట్లాడుతూ రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో సిబ్బంది, డాక్టర్ల నిర్లక్ష్యం వలనే మాత శిశు మరణాలు వరుసగా సంభవిస్తున్నాయని, ఈ నిర్లక్ష్యంపై డాక్టర్లు తప్పిదంపై అలాగే బాపనమ్మ మృతికి కారకులైన డాక్టర్లను వైద్యాధికారులను శిక్షించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఇప్పటివరకు ఐటీడీఏ అధికారులు, జిల్లా కలెక్టర్, రాష్ట్రస్థాయి అధికారులకు, జాతీయ స్థాయిలో ఎస్టీ, మహిళ, హ్యూమన్ రైట్స్ కమిషన్ కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. గత శుక్రవారం శాంతియుత నిరసనతో రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి బాపనమ్మ, పుట్టిన బిడ్డ మరణానికి కారణాలను వివరించడం జరిగిందన్నారు. ఆ సమయంలో కొంత సమయం ఇస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు అధికారి తెలియజేసి ఉన్నారని, అలాగే రంపచోడవరం పోలీస్ స్టేషన్ లోను ఫిర్యాదు చేయడం జరిగిందని, పోలీస్ అధికారులు ప్రాజెక్టు అధికారి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలియజేసారని, కాబట్టి సంబంధిత అధికారులు వేగవంతంగా విచారణ పూర్తి చేసి సంబంధిత డాక్టర్లపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తుఫాను ప్రభావం తగ్గిన వెంటనే రంపచోడవరం ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలతో, ప్రజలు సహకారంతో కలిసొచ్చే ఆదివాసీ సంఘాలు, రాజకీయ పార్టీలు అందరితో కలిసి రంపచోడవరం ఏరియా ఆసుపత్రి ముట్టడి కార్యక్రమం చేయబోతున్నట్లు ఆయన తెలియజేశారు. చాలాచోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ప్రజల ప్రాణాలు కాపాడటంలో, సురక్షితమైన ప్రసవాలు చేయడంలో రికార్డులు సృష్టింటే, రంపచోడవరం ఏరియా ఆసుపత్రి మాత్రం వైద్యులు ప్రజల్ని చంపడంలో రికార్డు సృష్టిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు రాజమండ్రి మొదలైన ప్రాంతాల నుండి ప్రతిరోజు రాకపోకలు సాగిస్తూ సకాలంలో ఆసుపత్రి కి రావడం లేదని, ఎమర్జెన్సీ పరిస్థితిలో, ప్రసవ సమయంలో ఆస్పత్రిలో పనిచేసే వర్కర్లు డ్యూటీ టైం లో ఉండే నర్సులే డాక్టర్లుగా పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. డాక్టర్లు మాత్రం ఉదయం 11, 12 గంటలకు హాస్పిటల్ కి వచ్చి సాయంత్రం మూడు నాలుగు గంటలకే ఇళ్లకు వెళ్లిపోతున్నారని ఆయన మండిపడ్డారు. సరిగ్గా డ్యూటీ చేయని డాక్టర్లకు జీతాలు ఎందుకు ఇవ్వాలని ఆయన ప్రశ్నించారు. డాక్టర్ల వృత్తికి ఉన్న మర్యాదను రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలోని డాక్టర్లు నీరుగారుస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏజెన్సీలో ఆదివాసి ప్రజలను వైద్యం కోసం వస్తే రంపచోడవరం ఏరియా ఆసుపత్రి డాక్టర్లు అంటరాని వారిగా చూస్తున్నారన్నారు. సరిగా డ్యూటీ చేసే వైద్యులను మాత్రమే ఆసుపత్రిలో ఉంచాలని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వైద్యులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే ఆసుపత్రి ముట్టడి ప్రజల ప్రయోజనం కోసమేనని ఆయన అన్నారు. ఎన్ని మరణాలు సంభవించినా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలు నోరు విప్పరనే అలుసుతో ఇక్కడ డాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కాబట్టి ఇప్పటివరకు ఏరియా ఆసుపత్రి డాక్టర్లు నిర్లక్ష్యం వలన కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులు, ఆదివాసీ ప్రజలు, ఆదివాసీ సంఘాలు, రాజకీయ పార్టీలు కలిసొచ్చి ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, డివిజన్ కోఆర్డినేటర్ పీతా ప్రసాద్, బాపనమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తుఫాను పరిస్థితుల పర్యవేక్షణలో కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

**– "తుఫాను ప్రభావం దృష్ట్యా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలి"**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రత్యేక అధికారి కే. కన్నబాబు మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మెగా స్వరూప , మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎస్డీసీ కే భాస్కర్ రెడ్డి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విభాగాల సమన్వయంతో పనిచేస్తున్న సిబ్బందికి కే.కన్నబాబు పలు సూచనలు చేశారు.సమయానుకూల చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు.కే.కన్నబాబు మాట్లాడుతూ, కమాండ్ కంట్రోల్‌రూమ్ ద్వారాజిల్లాలోని అన్ని మండలాల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కంట్రోల్ రూమ్‌కు వస్తున్న కాల్స్, అందుతున్న సమాచారం పట్ల వెంటనే స్పందించి, సంబంధిత మండలాధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాత్ర కీలకమని తెలిపారు.ప్రజలనుంచివచ్చే ప్రతి సమాచారాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, అవసరమైతే వెంటనే క్షేత్రస్థాయిలో సిబ్బందిని పంపించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అత్యవసర పనులు ఉన్నప్పుడే బహిరంగ ప్రదేశాలకు వెళ్లాలని, చెట్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండరాదని ప్రజలను హెచ్చరించారు.

తుఫాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బహిరంగ ప్రదేశాలకు వెళ్లాలి. విద్యుత్ తీగలు, చెట్లు లేదా నీటి మునిగిన ప్రాంతాలకు దగ్గరగా వెళ్లరాదు.వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పక పాటించాలి.

**అత్యవసర సహాయ నంబర్లు:**

112 1070 1800 4250101 (24/7 సేవలు)

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్

0883-2944455

డివిజన్ వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లు

రాజమహేంద్రవరం డివిజన్ - కంట్రోల్ రూమ్ నంబర్లు

ఆర్డీవో కార్యాలయం,రాజమహేంద్రవరం-0883-2442344/ 0883-2940695

రాజమహేంద్రవరం అర్బన్ - 9849903860

రాజమహేంద్రవరం రూరల్ - 6301523482

రాజానగరం - 9494546001

రంగంపేట - 9393931667

కోరుకొండ - 9154474851

అనపర్తి - 9441386920

బిక్కవోలు - 9849903913

సీతానగరం - 9177096888

గోకవరం - 9491385060

కొవ్వూరు డివిజన్ - కంట్రోల్ రూమ్ నంబర్లు

ఆర్డీవో కార్యాలయం, కొవ్వూరు - 7995367797

కొవ్వూరు - 9866778416

చాగల్లు - 9441293856

తాళ్లపూడి - 7993636666

పెరవలి - 08819-232179

ఉండ్రాజవరం- 9491041474

నల్లజర్ల -9491041451

దేవరపల్లి - 9705818045

గోపాలపురం - 7569856778

నిడదవోలు - 9440580856

## మొంతా తుఫానుతో ఏలేరు ఎగువ ప్రాంత జలాలతో నిండుకుండలా జలాశయం

**దిగువ ప్రాంతలకు నీరువిడుదల**

**9మండలాలకు ఏలేరు ముంపు**

**అప్రమత్తం దిశగా ప్రభుత్వ యంత్రాంగం**



**ఏలేశ్వరం, మేజర్‌న్యూస్ :** మోంతా తుఫాను ప్రభావంతో ఏలేరు ఎగు ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు పెద్దఎత్తున వరద నీరు ప్రోజెక్టులో వచ్చి చేరుతోంది. ఏలేరు ప్రోజెక్టు నీటి నిల్వలను సామర్థ్యన్ని పరిశీలిస్తే మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయానికి ఏలేరు ప్రొజెక్టులో నీటి నిలువలు 21.74టిఎంసిలు,85.39.మీటర్లు, 280.15 అడుగుల నీటినిలువలు ఉన్నాయి. కాగా ప్రోజెక్టు నీటి సామర్థ్యం 24.11 టిఎంసిలు, 86.56మీటర్లు, 24110 అడుగులు ఉండాల్సిఉంది. అయితే 5175 క్యూసెక్కుల నీరుఏలేరు ఎగు ప్రాంతల నుండి ప్రోజెక్టుకు వచ్చి చేరుతోందని ఏలేరు అధికారులు చెబుతున్నారు. దీనితో తుఫాను తీరం దాటే సమయంలో మరింత విస్తారంగా వర్షాలు కురుస్తాయనే అధికారులు అంచనాలతో అధిక జలాలను దిగు ప్రాంతాలకు 4400 క్యూసెక్కుల నీటిని స్పల్‌వే రెగ్యులేటర్ ద్వారా విడుదల చేస్తున్నారు.తిమ్మరాజు చేరువుకు 175 క్యూసెక్కులు, విశాఖకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.రాత్రి సమయంలో కురిసే వర్షాలకు ఏలేరు ప్రోజెక్టు గరిష్ట స్థాయికి చేరుకుంటే అదనపు జలాలను దిగువ ప్రాంతాలకు విడుదల చేయాల్సి ఉంది. దీనితో దిగు ప్రాంతాల గ్రామాలు ఏలేరు వరద నీటి ముంపుకు గురవుతాయి.కాగా ఏలేరు ఆయకట్టు ప్రాంతాలైన ఏలేశ్వరం, జగ్గంపేట, ప్రత్తిపాడు,కిర్లంపూడి, పెద్దాపురం,గొల్లప్రోలు, పిఠాపురం, యు,కొత్తపల్లి, తొండంగి ఈ 9 మండలాలకు ఏలేరు నది ఆనుకొని ఉన్న గ్రామాలన్నింటికీ వరదముంపు పొంచిఉంది.గతంలో గొల్లప్రోలు జాతీయరహదారి, గ్రామంలో కాలనీలు ముంపుకు గురై తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.అలాగే నీటి ఉదృతికి ఏలేరు గట్టు గండ్లు పడి గ్రామాలను ముంచెత్తిన చేదు ప్రభావాలు ఉన్నాయి.లోతట్టు ప్రాంతాల ప్రజలకు మోంతా తుఫాను పెను ప్రమాదం కాబోతోందని అధికారులు భావిస్తున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.లాగే భారీ వృక్షాలు, శిధిలాల ప్రక్కన, విధ్యుత్ స్థంబాలకు, హోర్డింగులకు దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. తుఫాను పెను ప్రమాదాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

## రంపచోడవరంను, కారం తమన్నా దొర జిల్లాగా ప్రకటించాలి

**– ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ డిమాండ్**



**చింతూరు,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామ రాజు జిల్లా, చింతూరు మండల కేంద్రంలో మం గళవారం ఆంధ్ర ప్రదేశ్ ఆదివాసీ జేఏసీ డివిజన్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి చింతూరు డివిజన్ జేఏసీ చైర్మన్ జల్లి నరేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ప్రకటనలో రంపచో డవరం, చింతూరు, పోలవరం ఏజెన్సీ ప్రాంతాలను కలుపుకొని రంపచోడ వరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతానికి పరిపాలన సౌలభ్యం సులభం ఔతుందని, మొత్తం కూడా ఏజెన్సీ ప్రాంతం కాబట్టి స్థానిక ఆదివాసీలకు న్యాయం జరుగుతుంది అని అన్నారు. కాబట్టి నాడు ప్రతి పక్షం నాయకుడిగా ఉన్నపుడు విలీన మండలాలకు వరద బాధితులను పరామర్శించ డానికి వచ్చినప్పుడు విలీన మండల ప్రజలకు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీని ప్రస్తుత ముఖ్యమంత్రి నారాచంద్ర బాబునాయుడు ఇప్పుడు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం ఐటీడీఏలోని ఎనిమిది మండలాలు చింతూరు ఐటీడీఏలోని నాలుగు విలీన మండలలు అలాగే పోలవరం నియోజకవర్గ కొట రామచంద్రపురం ఐటీడీఏ ప్రాంతాన్ని కలుపు కొని రంపచోడవరం కేంద్రంగా, కారం తమ్మన దొరపేరు పేరు తో మరో ప్రత్యేక ఏజెన్సీ జిల్లా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. లేని పక్షంలో ఆదివాసీ ఉద్యమం తీవ్రతారం చేస్తామని అయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఆదివాసీ జేఏసీ వైస్‌చైర్మన్,కారం.సాయిబాబు,మండల చైర్మన్.పొడి యం .రామకృష్ణ కాకా.సీతరామయ్య,డివిజన్ సభ్యులకు మడివి .రాజు.చదలవడా సర్పంచ్ కుంజా.తిరుపతి రావు,కలముల. ముత్త య్య,కులుమల రామయ్య, సుబ్బయ్య,నాగయ్య మడకం.రాజమ్మ, పాల్గొన్నారు.

# ప్రభుత్వం అండగా ఉంది







**– అప్రమత్తతతో ధైర్యంగా ఉండండి – ఎంపీ సానా సతీష్**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ .. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఇతర అధికారులతో కలిసి కాకినాడ పట్టణం ఏటిమొగ, దుమ్ములుపేటబీ పర్లోవపేట ఏఎంజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, తాళ్ళరేవు మండలం గాడిమొగ ఇతర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. కాకినాడ పట్టణంలో పునరావాసక కేంద్రాలకు తరలించిన ప్రజల కోసం కాకినాడ సూర్యకళామందిరం ప్రక్కన సిద్ధం చేసిన భోజన పదార్థాలను జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం కాకినాడ పట్టణం దుమ్ములుపేట తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజల కోసం పర్లోవపేట ఏఎంజీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ప్రజలకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ఎంపీ సానా సతీష్ బాబు, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు స్వయంగా మధ్యాహ్నం భోజనం వడ్డించారు. అనంతరం కాకినాడ జిల్లా తాళ్ళరేవు గాడిమొగ ధీరుబాయ్ అంబానీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు భోజన పదార్థాలు వడ్డించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ మొంథా తుఫాను నేపథ్యంలో కాకినాడ జిల్లాలో 18 మండలాల్లో 67 గ్రామాలు, 5 పట్టణ ప్రాంతాల్లో తుఫాను ప్రభావం ఉందన్నారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసేమన్నారు. జిల్లా వ్యాప్తంగా 401 పునరావాస కేంద్రాలు సిద్ధం చేయగా, ఇప్పటికే 76 కేంద్రాలు ప్రారంభించా మన్నారు. కాకినాడ పట్టణంలో 16 పునరావాస కేంద్రాల్లోకి లోతట్టు ప్రాంత ప్రజలను తరలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారయంత్రాంగం పునరావస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, అధికారులతో సహకరించి, ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పునరావాస కేంద్రాల్లోని ప్రజలు ఇబ్బందులు పడకుండా నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. మొంథా తుఫాను కారణంగా మంగళవారం సాయంత్రం నుంచి అధిక వర్షాలు, అధిక వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు పునరావాస కేంద్రాలను విడిచి వెళ్ళరాదన్నారు. తీరం సమీపిస్తున్న కొద్ది తుఫాను తీవ్రత అధికంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ప్రజలేవరు బయటకు రావద్దని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. ఈ పరిశీలనలో కాకినాడ కమిషనర్ కెపీ.సుధాకర్, జిల్లా కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ ఎన్వీవీ.సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ. వెంకటలక్ష్మి, కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, తాళ్ళరేవు తహసీల్దార్ పి.శ్రీనాథ్ ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏలేరు వరద ఉధృతిని పరిశీలించిన ఆర్డీఓ శ్రీరమణి



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, కాండ్రకోట గ్రామంలో మంగళవారం పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి, తహశీల్దార్ వెంకటలక్ష్మీ, ఎస్సై వి.మౌనికలతో కలసి ఏలేరు వరద ఉధృతిని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె తహశీల్దార్, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతూ వరద ఉధృతికి తీసుకోవలసిన చర్యలు, అలాగే మొంథా తుఫాన్ వల్ల తీసుకునే చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతీ గ్రామంలోను సంబంధిత అధికారులు, అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ప్రాణ, ఆస్థి నష్టం రాకుండా చూడాలని ఆమె అధికారులకు సూచించారు. ఆమె వెంట ఇరిగేషన్ ఏఇ నిమ్మకాయల శ్రీనివాస్ కుమార్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

## నగరంలో సిపిఎం బృందం పర్యటన

**– ప్రమాదకరంగా డంపింగ్ యార్డ్ ప్రాంతం**
**– సిపిఎం విన్నపంతో 2 రోజులు డంపింగ్ నిలిపివేస్తామన్న అధికారులు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** తుఫాను నేపథ్యంలో కాకినాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో సిపిఎం పర్యటనలో భాగంగా సంజయ్ నగర్ లో గల డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని సిపిఎం బృందం మంగళవారం ఉదయం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ సంధ్యా నగర్ డంపింగ్ యార్డ్ కి ఒకే మార్గం ఉండడంవల్ల డంపింగ్ యార్డ్ చెత్త పేరుకుపోవడం వల్ల వాహనాలు రాకపోకలు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయని తెలిపారు. వర్షాలకు బురదగా ఆ ప్రాంతమంతా వాహనాలు లోపలికి వెళ్లడానికి సరైన మార్గం లేక గంటల తరబడి సంజయ్ నగర్ రోడ్డులో వేచి ఉండాల్సి వస్తుందన్నారు. వాహనాల నుండి చెత్తని డప్పు చేసే సమయంలో డ్రైవర్లు వర్కర్లు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని నగన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వారు, కమిషనర్ మరియు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్లకు తెలియజేయగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వి చరణ్ స్వయంగా పలివెల వీరబాబు కి ఫోన్ చేసి మంగళవారం, బుధవారం డంపింగ్ యార్డ్ కు వాహనాలు రాకుండా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అధికారుల స్పందనకు ధన్యవాదాలు తెలియచేస్తూ తుఫాన్ సందర్భంగా ప్రజలు రక్షణతో పాటు ప్రజల్లో భాగమై క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది క్షేమం కూడా అధికారులు చూడాలని కోరుతున్నామన్నారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు కె. సత్తిరాజు, మలక వెంకటరమణ లతో పాటు మేడిశెట్టి వెంకటరమణ, టి.రాణి ఈ పర్యటనలో ఉన్నారు.

## అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

**– ఐటీడీఏ పివో స్మరణ్ రాజ్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వలన భారీ వర్షాలు కురిసి ఏజెన్సీ ప్రాంతంలో వాగులు పొంగే ప్రమాదం ఉందని, ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ సూచించారు. రంపచోడవరం మండలం దిరిసినపల్లి, దేవీపట్నం మండలం ఇందుకూరు, ఇందుకూరుపేట, పెద్ద బీంపల్లి, లోతుపాలెం, చాపరాయిపల్లి గ్రామాలలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో మొంథా తుఫాను కారణంగా తీరం దాటే సమయంలో ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాగులు పొంగే ప్రమాదం ఉన్నందున వంతెనలు, కల్వట్లు ఏ విధంగా ఉన్నవి ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. తుఫాను వలన భారీ వర్షాలు కురిసే అవకాశం వున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని ప్రాజెక్ట్ అధికారి సూచించారు. ఎక్కడైనా తుపాను వలన ఇబ్బందులు పడుతున్నవారు ఉంటే రంపచోడవరం ఐటీడీఏ కంట్రోల్ రూమ్ 08864 – 242114కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. ఏజెన్సీ మండలాలలో తుఫాను వలన అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నది లేనిది ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. అదేవిధంగా స్పెషల్ మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. తుపాను తగ్గేవరకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రాజెక్ట్ అధికారి వెంట దేవీపట్నం తాసిల్దార్ కె.సత్యనారాయణ, ఎంపీడీవో సాల్మన్ రాజ్ పాల్గొన్నారు.

## పెద్దాపురం మండలంలో 5 పునరావాస కేంద్రాలు ఏర్పాటు

**– పరిశీలించిన తహసిల్దార్ వెంకటలక్ష్మి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొంతా తుఫాను నేపథ్యంలో పెద్దాపురం మండలంలో ఐదు పునారవాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పెద్దాపురం తహసిల్దార్ సిహెచ్. వెంకటలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ మండలంలో సిబి దేవం, వడ్లమూరు, ఆర్బి పట్నం, కట్టమూరు, మర్లావ గ్రామాల్లో ఈ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఇ ప్పటికీ 103 మందిని ఈ పునరావాస కేంద్రాల్లో ఉంచడం జరిగిందని వారికి ఆహారం, మంచినీరు, అందజేసినట్లు తహసిల్దార్ తెలిపారు. దీనీలో భాగంగా ఈ పునరావాస కేంద్రాలను తహసిల్దార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## పెద్దాపురం డివిజన్‌లో వర్షపాతం వివరాలు

**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం డివిజన్‌లోని 11 మండలాలలో సోమవారం ఉదయం 8.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు నమోదైన వర్షపాతాల వివ రాలు. కోటనందూరు మండలం 10.2 మి.మీ., తుని 18.8 మి.మీ., రౌతులపూడి 19.2 మి.మీ., శంఖవరం 15.6 మి.మీ., ఏలేశ్వరం 8.8 మి.మీ., జగ్గంపేట 8.6 మి.మీ., కిర్లంపూడి 9.2 మి.మీ., ప్రత్తిపాడు 9.6 మి.మీ., తొండంగి 14.8 మి.మీ., పెద్దాపురం 8.6 మి.మీ., గండేపల్లి 7.2 మి.మీ., వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.